# అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఇంటింటికీ మంచినీటినందించిన ఘనత బీఆర్ఎస్‌దే
- భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొయినాబాద్ : ఎల్కగూడ గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య

మొయినాబాద్, అక్టోబర్ 25 : కాంగ్రెస్ పార్టీ అరవై ఏండ్ల పాలనలో గొంతు తడుపు కోవడానికి గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడేవారిని, బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ సురక్షిత మంచి నీళ్లు అందుతున్నాయని ఎమ్మెల్యే , బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్కగూడ, కుతుబుద్దీన్‌గూడ, వీరన్నపేట, చందానగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించిన కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ ప్రాంత ప్రజలు ఉమ్మడి రాష్ట్రంలో తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇంటింటికీ మంచినీటిని అందించిన దాఖలాలు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, ఎల్కగూడ సర్పంచ్ ఆలూరి కుమార్, కుతుబుద్దీన్‌గూడ సర్పంచ్ పద్మమ్మ, చిన్నమంగారం ఎంపీటీసీ బట్టు మల్లేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంఏ రవూఫ్, మాజీ జడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీహరి యాదవ్, సీనియర్ నాయకులు దర్గ రాజు, విఠల్, మల్లేశ్, సురేందర్‌గౌడ్, పరమేశ్, రమేశ్, కిరణ్, ప్రభాకర్‌రెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు**

షాద్‌నగర్‌టౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తు ఓటు వేయాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రజల కోసం ఆలోచన చేసే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా నిలువాలన్నారు. షాద్‌నగర్ మరింత అభివృద్ధి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో సాధ్యమని, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జూపల్లి శంకర్, సుధాకర్, పాండురంగారెడ్డి, భిక్షపతి, సలీం, రాజు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌టౌన్ : కారుగుర్తుకు ఓటు వేయాలని ఓటర్‌ను అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు

## నేడు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

- హాజరుకానున్న మంత్రి మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, అక్టోబర్ 25: షాబాద్ మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గూడూర్ నర్సింగ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో షాబాద్ మండలంలోని నాగరగూడ నుంచి షాబాద్ వరకు పెద్ద ఎత్తున బైకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు హాజరుకానున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. మండలంలోని 41 గ్రామాల నుంచి బైకు ర్యాలీకి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం మొదలుకానుంది. అన్ని గ్రామాల్లో ప్రతి గడప తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించనున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోనే షాబాద్ మండలం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో కాలె యాదయ్యకు అత్యధిక మెజార్టీని అందించేందుకు అవినాశ్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకుంటున్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నారు.

## నేడు పాఠశాలలు పున:ప్రారంభం




పెద్దేముల్, అక్టోబర్ 25 : దసరా సెలవులు ముగియడంతో నేటి నుంచి మండల పరిధిలోని అన్ని పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలో మొత్తం 61 పాఠశాలలు ఉండగా అందులో 45 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 మాడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించిన విషయం విదితమే. కాగా, బుధవారంతో సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు, కళాశాలలు పున:ప్రారంభం కానున్నాయి.

## రూ.11లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దోమూరి గోపాల్

షాబాద్, అక్టోబర్ 25: సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన దోమూరి గోపాల్ మల్లన్న దేవాలయం నిర్మాణానికి బుధవారం రూ.11లక్షల విరాళం చెక్కును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని చెప్పారు. దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, పొన్న వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌కు చేరిన ఈవీఎంలు



షాద్‌నగర్, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల అధికారులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల పరిశీలన, నూతన కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల తుది జాబితా వంటి పనులను పూర్తిచేసిన అధికారులు బుధవారం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలో ఈవీఎం యంత్రాలను భద్రపరిచారు. ఆర్డీవో వెంకటమాధవరావు, ఏసీపీ రంగస్వామి, తహసీల్దార్ పార్థసారథి పర్యవేక్షణలో 310 ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపర్చామని సిబ్బంది తెలిపారు.

## బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు



కేశంపేట ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న చౌదరిగూడ యువకులు

షాద్‌నగర్, అక్టోబర్ 25 : బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి సమక్షంలో చౌదరిగూడ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పాలన కొనసాగుతుందని చెప్పారు. సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని, కేవలం మోసపూరిత మాటలు చెబుతూ ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మన ప్రాంత అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌తో కలిసి రావాలని, మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమనే విషయాన్ని అందరూ గుర్తించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆసిఫ్, సర్పంచ్ బాబురావు, నాయకులు చెన్నయ్య, రమేశ్ నాయక్, ప్రభు, అనంతి, రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో వేధింపులు.. రిమాండ్

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 25: యువతిని కొన్ని రోజులుగా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న యువకుడిని పోలీసులు రిమాండ్ చేశారు. సీఐ మన్మోహన్ కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన వాడెపు కార్తిక్ చారి హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నాడు. అక్కడే రూంలో ఉంటున్న అమ్మాయిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఫోన్‌లో అసభ్యకరంగా సందేశాలు పంపిస్తున్నాడు. అడ్డగించడంతో పాటు బెదిరిస్తున్నాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు మన్మోహన్‌యాదవ్ తెలిపారు. బుధవారం కార్తిక్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. గతంలో దోపిడీ కేసులు ఉన్నాయన్నారు. పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు.

## వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

పరిగి టౌన్, అక్టోబర్ 25 : వాహనాల తనిఖీలో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.2,83,500 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పరిగి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు సరైన ఆధారాలు లేకుండా కుమ్మరి యాదగిరి రూ.1.50 లక్షలు, యాదిరెడ్డి వద్ద రూ.1.33.500 లభించాయని డబ్బులకు సంబంధించిన సరైన ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీనివాస్

కులకచర్ల, అక్టోబర్ 25 : రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కులకచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. కులకచర్ల మండలం గోరిగడ్డతండాకు చెందిన శ్రీనివాస్ అతడి భార్య జయ(కవిత) కులకచర్ల నుంచి చౌడాపూర్ వైపు వెళుతుండగా, గుబ్బడి తండాకు చెందిన బాలు, మరో వ్యక్తి బైక్‌పైన వస్తుండగా, గండిచెరువు మైసమ్మ టెంపుల్ వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో శ్రీనివాస్(32), అతడి భార్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108లో మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీనివాస్ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మరో వాహనంపై వెళుతున్న ఒక వ్యక్తికి కూడా తీవ్రగాయాలైనట్లు స్థానికులు పేర్కొన్నారు.